క్లుప్తంగా

ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తున్నారు

దౌల్తాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మహిపాల్ ఆరోపించారు. ప్రభుత్వ వ్యవహార తీరుపై ప్రశ్నిస్తున్న తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేయించడం బాధాకరమని పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌పై ఇప్పటి వరకు 14 అక్రమ కేసులను కాంగ్రెస్ నాయకులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పలకల పంపిణీ



ఉచితంగా పలకలు అందజేస్తున్న హెచ్ఎం విజయలక్ష్మి, ఎంఈఓ హరిలాల్

బొంరాస్‌పేట: పాఠాలు చెప్పడమే కాదు, పేద విద్యార్థులకు తనవంతు సాయం అందజేసి మానవత్వం చాటుకుంటోంది టీచరు విజయలక్ష్మి. తను పనిచేసే పాఠశాలల్లో వేతనంలో నుంచి కొంత మొత్తం పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించడంతో పాటు అభ్యసన సామగ్రి అందిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తుందని పలువురు వాపోతున్నారు. భోజన్నగడ్డ తండా అంగన్‌వాడీలోని 19మంది చిన్నారులకు మంగళవారం ఉచితంగా పలకలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. అంకిత ఫౌండేషన్ నుంచి ఎంఈఓ హరిలాల్ మ్యాట్‌లు, బ్యాగులు, నోటుపుస్తకాలు అందజేశారు. సీఆర్పీ సోమ్లా, అంగన్‌వాడీ పద్మ, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పార్టీ నుంచి బూత్‌లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలించి ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే బీఎల్‌ఓల దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పట్టణ మాజీ సర్పంచు రమేష్‌బాబు, సీపీఐ నాయకుడు ఇంద నూర్ బషీర్, బీజేపీ నాయకుడు కృష్ణ యాదవ్, ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్, కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్ ఖాన్, తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్



మార్కింగ్ వేయిస్తున్న కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో లబ్ధిదారునికి మంజూరైన ఇంటి నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ మార్కింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసిందని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ పరిధిలో మంజూరైన ఇళ్లకు మార్కింగ్ వేయిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరి

- వాహనాలు రోడ్డుపై నిలిపితే చర్యలు
- కుల్కచర్ల ఎస్ఐ రమేశ్



దుకాణదారుడికి నోటీసులు అందజేస్తున్న అధికారులు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రోడ్డుపై నిలిపితే చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ తెలిపారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పలు దుకాణదారులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

తనిఖీలతో సరి!

- ఫర్టిలైజర్ దుకాణాల్లో అక్రమాలు బయటపడితే చర్యలు శూన్యం
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫారస్సు బుట్టదాఖలు
- సంబంధిత అధికారులను నిలదీస్తున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ

ధారూరు: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక దాడులు చేస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిపై చర్యల కోసం వ్యవసాయశాఖ అధికారులకు అప్పగిస్తే వారు చేతులెత్తేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడులు చేసే అధికారులకే పూర్తి స్థాయి అధికారం కట్టబెట్టాలని భావిస్తున్నారు. కేసులు నమోదు చేస్తేనే ఫర్టిలైజర్ దుకాణ యజమానులు భయపడతారని, లేదంటే ఎన్ని దాడులు చేసినా ఫలితం శూన్యం. వారి నుంచి ఎన్ని అక్రమాలు బయటకు తీసినా ప్రయోజనం ఏంటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, తహశీల్దార్ గంగాప్రసాద్‌లు ధారూరులోని ఓ ఫర్టిలైజర్ విత్తన, ఎరువుల విక్రేత దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎరువుల నిల్వ, అమ్మకాల వివరాలు సక్రమంగా లేవని, అనుమతులు లేని క్రిమి సంహారక మందులు విక్రయిస్తున్న 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలను గుర్తించారు. ఈ దుకాణ యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని ధారూరు వ్యవసాయ శాఖ అధికారికి నివేదిక అందజేశారు.



ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

ఇంతవరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేసు కూడా నమోదు చేయలేదు.

ఆకస్మిక తనిఖీలకే..

ఆకస్మిక దాడులు చేస్తూ అక్రమాలను బయటపెడుతున్నా తగిన చర్యలు తీసుకునే అధికారం లేని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను నియమించడం ఎందుకని రైతులు నిలదీస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ యజమానులపై వ్యవసాయ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం బాధాకరం.

లైసెన్సులు లేకుండానే..

చాలచోట్ల లైసెన్సు లేకుండానే విక్రయిస్తున్నా అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. వారి నుంచి లంచాలు తీసుకుంటూ ఏం తెలియనట్లు వ్యవహరిస్తున్నారని కొందరు బాహాటంగానే చెబుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల యజమానుల ద్వారా మామూళ్లు వసూలు చేస్తుండడంతోనే చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేస్తున్న తనిఖీలు, వెలుగు చూసిన అక్రమాలపై చర్యలు తీసుకుంటేనే నిందితులు భయపడతారని, లేనిపక్షంలో తనిఖీలు నామ మాత్రంగానే ఉంటాయని వాపోతున్నారు.

మూతబడ్డ పాఠశాలలు తెరుచుకోవా?

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని దుద్యాల్ మండలంలో సోమ్లనాయక్ తండా, వాల్యా నాయక్ తండా, రోటిబండ తండాల్లో పాఠశాలలు మూతబడ్డాయి. ఈ ప్రాంతాల్లో పాఠశాలలు తెరుచుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆయా తండాలకు చెందిన విద్యార్థులు ప్రైవేట్ బాట పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో గత అకాడమిక్ సంవత్సరం నుంచి విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల దారి పట్టారని తండా వాసులు వాపోయారు. ఈ విషయమైన మండల విద్యాధికారి విజయ రామారావును వివరణ కోరగా విద్యార్థులు అందుబాటులో లేకపోవడంతోనే పాఠశాలలు మూతబడ్డాయని చెబుతున్నారు. విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటే తప్పకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని తెలిపారు.



మూతబడ్డ సోమ్లు నాయక్ తండా పాఠశాల



తెరుచుకోని వాల్యా నాయక్ తండా పాఠశాల

జీవనోపాధికి కుట్టుమిషన్లు దోహదం



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్

దుద్యాల్: ముస్లిం మహిళల జీవనోపాధికి కుట్టు మిషన్లు ఎంతగానో దోహదపడుతాయని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలానికి చెందిన 74 మందికి కుట్టు మిషన్లను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, మాజీ ఎంపీపీ మంగమ్మతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకే మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజా, దుద్యాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న బందయ్య

కుల్కచర్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకుసాగుతుందని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు బందయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామంలో సుపరిపాలన వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వెంకటేశ్, జనార్దన్, హన్మంతు, నరేశ్, ప్రవీణ్, శ్రీను, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయం

అనంతగిరి: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో నిబంధనలనకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్ పుస్తకాలు అమ్ముతున్నారన్నారని, పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బ్రిడ్జికి మరమ్మతులు

ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



బుద్దారం బ్రిడ్జిపై గుంతలు పూడ్చుతున్న సిబ్బంది

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం బుద్దారం బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు, వాహనదారులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులకు మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో వారు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను సిమెంట్, కంకరవేసి పూడ్చివేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సహాయ నిధి పేదల పెన్నిధి

మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: సీఎం సహాయ నిధి పేదల పెన్నిధి అని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి రూ.8.65లక్షల చెక్కులను మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు ఇవి ఉపయోగపడుతాయన్నారు. ఆరోగ్య శ్రీ లేని ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, సురేందర్, మహంత్‌స్వామి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: బాధితులకు చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో..

మర్పల్లి: మర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సురేశ్, నర్సింహరెడ్డి, రాకేశ్, నాగేశ్, సుగ్రీవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించండి

సీడీపీఓ ప్రవీణ

మోమిన్‌పేట: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సీడీపీఓ ప్రవీణ పేర్కొన్నారు. మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట ముగింపులో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ కేంద్రాలు సహకరిస్తాయన్నారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు కూడా పౌష్టికాహారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, కార్యకర్తలు గోగమ్మ, రేణుక, మమత, వసంత, భాగ్య, ప్రమీల తదితరుల పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి హాజరై తల్లులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ జ్యోతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన కౌమారదశ విద్య ఉంటుందని మర్పల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా బేగం పేర్కొన్నారు. మండల పరిధిలోని భూచన్పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శివకుమార్, వర్కర్ సరోజ, బుజ్జమ్మ, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్ రామ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: బషీరాబాద్ మండల కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్ వైజర్ జ్యోతి 3 సంవ్సరాలు నిండిన చిన్నారుల పేర్లను నమోదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు వాణీశ్రీ, శోభారాణి, వసంతలక్ష్మి, శాంతభాయి, మొగులమ్మ వినోద, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: కోల్కుందలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ ప్రవీణ



బంట్వారం: కోట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



కుల్కచర్ల: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



దోమ: ఫిర్యాదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ

కుల్కచర్ల: రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు చేకూరుతుందని కుల్కచర్ల తహశీల్దార్ మనోహర్ చక్రవర్తి, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు భూ భారతి ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దవరులు రవి, ఖాజ, రెవెన్యూ సిబ్బంది పావని, లక్ష్మయ్య, స్వప్న, అనిత, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన

బొంరాస్‌పేట: మండల పరిధిలోని సాలిండాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన లభించింది. తహశీల్దారు పద్మావతి రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పలురకాల భూ సమస్యలను పరిష్కరించాలని 35మంది దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శిరీష, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

దోమ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహశీల్దార్ గోవిందమ్మ అన్నారు. దోమ మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామంలో రెవెన్యూ నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతుకుమార్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

తాండూరు టౌన్: అణగారిన కులస్తులపై జరిగే దాడులను ప్రభుత్వం అరికట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన ఎరుకలి శారద కుటుంబీకులపై అగ్రవర్ణాలకు చెందిన కొందరు దాడి చేయడంతో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన కులస్థులపై చేపడుతున్న దాడులను వెంటనే అరికట్టాలని, అగ్రకులస్తులను అధికారులు వంత పాడడం బాధాకరమన్నారు. ఇలాంటి దాడులకు అడ్డుకట్ట వేయాలంటే రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖాధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచించిన విధంగా దళిత, గిరిజన, ఎరుకలి తదితర కులాల వారికి భరోసా కల్పించాలన్నారు.



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

సంక్షిప్త వార్తలు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

యాలాల: మండల కేంద్రంలోని చావిడీ సమీపంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని వివరించారు. యాలాలతో పాటు సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నవాబుపేట: రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో ఆయా గ్రామాల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బొంరాస్‌పేట: వీరశైవ ధార్మిక సేవారత్న అవార్డు గ్రహిత బుక్క బాలప్రకాశ్ దంపతులను మంగళవారం పలు గ్రామాలకు చెందిన వీరశైవ, జంగమ నాయకులు సన్మానించి గౌరవించారు. ధార్మిక కార్యక్రమాలతో సేవారత్న అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. జంగమ, మహేశ్వరులు జగదీశ్వరయ్య, వినోద్, భానుప్రకాశ్, జంగం గౌరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌లకు సంఘీభావం

అనంతగిరి: జూనియర్ డాక్టర్‌లకు చెల్లించాల్సిన స్టయిఫండ్‌ను 4 నెలలుగా చెల్లించడంలేదని కోరుతూ వికారాబాద్‌లోని మహవీర్ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం సైతం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ సంఘీభావం తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం

తాండూరు రూరల్: తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని చంద్ర వంచ గ్రామ మాజీ సర్పంచు శ్రీదేవి భర్త విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి మ్యాతరి లక్ష్మీ వద్ద డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదని కొట్టిపారేశారు. ఈ విషయం గురించి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పూర్తి వివరాలు అందజేశానని పేర్కొన్నారు. తన ఎదుగుదలను భరించలేని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

అనంతగిరి: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో బడిబాట నిర్వహించారు. బాలిక విద్యా ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు అబ్బాయిలతో పాటు అమ్మాయిలను కూడా సమానంగా చూడాలన్నారు. ఎక్కడ కూడా తారతమ్యం ప్రదర్శించొద్దని సూచించారు. ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఇన్‌చార్జి దేవకుమారి, ఉపాధాయురాలు హేమలత, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల్: పేదలకు ఇళ్లు మంజూరు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం నాజుఖాన్‌పల్లి, ఎక్కచెరువు తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను మాజీ ఎంపీపీ మంగమ్మతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఏఈ వరుణ్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన చేపడుతున్నారని ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల నుంచి, గ్రామాల నుంచి 6వ తరగతి, 8వ తరగతుల్లో 82మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది, ఎంఈఓ రాంరెడ్డి నూతన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందిస్తూ ఆహ్వానించారు.

సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను మండలంలోని విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, చౌదర్‌పల్లి హెచ్ఎం రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా మండల పరిధిలోని చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు. తాండూరు మండలం కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫిజికల్ డైరక్టర్‌గా పని చేస్తున్న రవికుమార్ తన పిల్లలు రాథోడ్ గంగ, జమునా, సందీప్‌లను తను పని చేస్తున్న కరన్‌కోట్ పాఠశాలలోనే చేర్పించాడు. తమ పాఠశాలలో అధ్యాపకులు మంచి బోధన చేస్తున్నారని, మెరుగైన ఫలితాలు కూడా వస్తున్నాయని వివరించారు. అనంతరం హెచ్ఎం రమేష్‌తో పాటు అధ్యాపక బృందం రవికుమార్‌ను అభినందించారు.



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి



తాండూరు రూరల్: కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చేర్పిస్తున్న పీడీ రవికుమార్